# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 25 జనవరి, 2026 | పేజీలు :08


## సమ్మక్క జాతరలకు పటిష్ఠ బందొబస్తు: సిపి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగే శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతరలకు పటిష్ఠ బందొబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శనివారం రాత్రి సీపీ గోదావరిఖని గంగానగర్ బ్రిడ్జి వద్ద సమ్మక్క జాతర ప్రదేశాన్ని సందర్శించారు. అమ్మవార్ల గద్దెల వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. జాతర జరిగే సమయాల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ వెంట గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, వన్‌టౌన్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్లు ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్‌రావు, రాజేశ్వర్‌రావు, భీమేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఏవో కాంతారెడ్డి, రాజయ్య, పొల్సాని శ్రీనివాస్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

### ఓటు హక్కు వినియోగించుకోవడం
# అందరి బాధ్యత

ఇంచార్జి కలెక్టర్,
ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు . మై ఇండియా .. మై ఓట్ అనే థీమ్ తో 16వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల ఉద్యోగులు భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము అని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలో ఇటీవల గ్రామ పంచాయతి ఎన్నికలు అందరి సహకారంతో ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు, ఎథికల్ ఓటింగ్ పై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని వివరించారు. 18 ఏండ్ల వయసు వచ్చిన వారు అందరూ ఓటు వేయవచ్చని, నిర్ణీత వయసు వచ్చిన వారు అన్ని ఎన్నికల్లో పోటి చేసే హక్కు ఉందని తెలిపారు. ఓటు హక్కు నమోదు అనేది నిరంతర ప్రక్రియ అని, దీనికి ఎంతో మంది అధికారులు సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

**సీనియర్, నూతన ఓటర్లకు సన్మానం**


ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ ఓటర్లు, నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువ ఓటర్లను ఇంచార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్ శాలువాతో సన్మానించారు. అలాగే నూతన ఎపిక్ కార్డులు అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమాల్లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, సీపీఓ శ్రీనివాసాచారి ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు గడప గడపకు అందాలి!

రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడప గడపకు అందేలా చూడాలని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ నగరపాలక మెప్మా సిబ్బంది, ఆర్.పి.లను కోరారు. శనివారం రాత్రి ఎన్‌టిపిసి మిలినీయం హాల్‌లో మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పథకాల గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అర్హులకు ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. 18 నుంచి 65 ఏళ్లలోపు మహిళలందరూ స్వశక్తి సంఘాల్లో చేరేలా ప్రోత్సహించాలన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకై ఆసక్తి ఉన్న వారిని గుర్తిస్తే వారికి కావాల్సిన నైపుణ్యాన్ని సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తానన్నారు. సోలార్ పవర్ ప్లాంటు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకై ప్రభుత్వ స్థలం ఇప్పించడంతోపాటు బ్యాంకు సబ్సిడీ రుణాల మంజూరుకు సహకరిస్తానన్నారు. మహిళలు తాము తీసుకున్న రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించాలన్నారు. సుమారు 5 వేల మంది యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించి హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ప్లేస్‌మెంట్ కల్పించినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి యూనిట్ల స్థాపనకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ, కోఆర్డినేటర్ మౌనిక, సీవోలు శమంత, ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శినిలు పాల్గొన్నారు.





మెయిన్‌లో

**చివరిమడి వరకూ నీరందించి రైతులను కాపాడుకుంటాం**

# ఐదవ రోజు అట్టహాసంగా నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం

పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్..
జిల్లా ప్రజల కోరిక మేరకు నిర్మల్ ఉత్సవాలు మరొక రోజు పొడిగింపు ప్రకటన..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఐదవ రోజు నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం అటహాసంగా కొనసాగింది.నిర్మల్ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ఎన్టీఆర్ మినీ స్టేడియం కిక్కిరిసిపోయింది.చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రజలు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపారు.ఏర్పాటు చేసిన సాల్స్ ను సందర్శిస్తూ వివిధ రకాల ఆహార పదార్థాలను ఆస్వాదించారు.సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరయ్యారు.సాంస్కాతిక కార్యక్రమాలను వీక్షించి కళాకారులను అభినందించారు.అనంతరం నిర్మల్ ఉత్సవాల వేదికపై కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సవాలను ఆదరిస్తున్నందుకు జిల్లా ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా ప్రజల కోరిక మేరకు నేటితో ముగియాల్సిన నిర్మల్ ఉత్సవాల కార్యక్రమాన్ని మరొక రోజు (రేపటి వరకు)పొడిగిస్తున్నట్లు ప్రకటించారు.ఐదవ రోజు నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,జిల్లా అధికారులు,వివిధ శాఖల అధికారులు,కళాకారులు,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.ఉత్సవాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చేపట్టినట్లు అధికారులు తెలిపారు.



# బండి సంజయ్‌కు సునీల్‌రావు వెన్నుపోటు పొడవడం ఖాయం

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** వెన్నుపోట్లకు కేరాఫ్ అడ్రస్ మాజీ మేయర్ తోడేలు సునీల్‌రావు అని, ఆయన కొద్ది రోజుల్లో కేంద్రమంత్రి బండి సంజయ్‌కు వెన్నుపోటు పొడవడం ఖాయమని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు నందెల్లి ప్రకాష్ ఆరోపించారు. సొంత సామాజిక వర్గ నేతలు చొక్కారావు ఎమ్మెస్సార్ , వినోద్‌కుమార్‌ను అణగదొక్కిన చరిత్ర సునీల్‌రావుది అని మండిపడ్డారు. రాజేందర్‌రావుపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. శనివారం కొత్తపల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకాష్ మాట్లాడారు. సునీల్‌రావుకు రాజకీయ బిక్ష పెట్టిందే మాజీ ఎమ్మెల్యే జగపతిరావు అని, అలాంటి కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన సునీల్‌రావు రాజేందర్‌రావుపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. రాజేందర్‌రావు గల్లీ గల్లీలో పర్యటిస్తుంటే సునీల్‌రావు , బిజెపి నేతలు గుండెలు గుబేళ్లు మంటున్నాయని, దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆరోపించారు. ఎక్కడ ఓటమి చెందుతామనే నిస్పృహాలో పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కరీంనగర్‌లో జరిగిన స్మార్ట్‌సిటీ అవినీతి పనుల్లో సునీల్‌రావు జైలకు వెళ్లడం ఖాయమని రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి



కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు గండి గణేష్, వెలిచాల రాజేందర్‌రావు యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, నాయకులు కట్ట సంజయ్, కుతాడి సాయి, శనిగరపు సతీష్‌లున్నారు.

## మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు.



**ప్రజాపక్షం/వేములవాడ:**వేములవాడలో రాబోయే మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాల్లో అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఆయిల్ మార్పు పనులు చేపట్టి, నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం చలువ పందిర్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఆలయం మరియు పరిసర ప్రాంతాల్లో అవసరమైన చోట్ల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.మహాశివరాత్రి జాతర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## టిజిఒఎల క్యాలెండర్ల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని తహసీల్ కార్యాలయం అవరణలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసొసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్లను అసొసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటి డైరక్టర్ పానగంటి సత్యానారాయణ, బ్రహ్మణపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు చల్లా రవీందర్‌రెడ్డి, అంతర్గాంరామగుండం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పంజాల రాధాస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి సందూరి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి కాంపెల్లి మల్లిఖార్జునస్వామి, తహసీల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మణపల్లిలో యువకుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన మడ్డి హరీష్‌గౌడ్ శనివారం తన ఇంటిలో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. హరీష్‌గౌడ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అంతర్గాం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేయడానికి సునీల్‌రావు సిద్ధమా?

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** మాజీ మేయర్ సునీల్‌రావు ఎంత అవినీతికి పాల్పడ్డారో నగర ప్రజలందరికీ తెలుసని 42వ డివిజన్ కాంగ్రెస్ నేత డాక్టర్ రాజన్న అన్నారు. రాజకీయాలలో విమర్శలు, ఆరోపణలు చేసే విషయంలో ఒక పద్ధతి ఉంటుందని, దానికి భిన్నంగా కుక్కలు, పందులు అంటూ అసభ్యకరంగా వ్యాఖ్యలు చేయడం సునీల్‌రావుకు తగదన్నారు. ప్రజాసేవ చేయాలని వచ్చిన వెలిచాల రాజేందర్‌రావు కాంట్రాక్టర్‌గా దోచుకున్నారని, దున్నపోతు అని మనిషిని పోల్చుతూ ఆరోపణలు చేయడం, అవినీతి ఆనకొండ రీతిగా అవినీతికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు చేయడం, తాను ఉద్యోగంలో గొర్రెలు అమ్ముకున్నానని అనుచిత వ్యాఖ్యలు చేయడం సంస్కారం కాదన్నారు. సరెండర్‌కు, సస్పెన్షన్‌కు తేడా తెలియని సునీల్‌రావు ఐదేళ్లపాటు మేయర్‌గా ఎలా ఉన్నారో అర్ధం కావడం లేదన్నారు. పూర్తిగా అవగాహన రాహిత్యాంగా మాట్లాడారన్నారు. రాజకీయాల్లోనూ ఆయన స్వలాభం కోసం ఎంతో మందికి వెన్నుపోటు పొడిచారని స్పష్టమైందన్నారు. అవినీతి చిట్టా బయటపెట్టడానికి తన వద్ద ఆధారాలున్నాయని, సంధర్భం వచ్చినప్పుడు తప్పకుండా బయటపెడతానని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు లయాక్, మహమ్మద్ చాంద్ తదితరులున్నారు.




## యువతను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/చొప్పదండి:** గ్రామీణ యువతను ఏకం చేసి వారిని అభివృద్ధి పథకంలో నడిపించడమే లక్ష్యమని కరీంనగర్ డీవైవో వెంకటరాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో యువ మండల వికాస్ అభియాన్ కార్యక్రమంపై యువజన సంఘాల నాయకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న యువజన సంఘాల బలోపేతం, నూతన సంఘాల ఏర్పాటు ద్వారా వారిని మై భారత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా విభాగాలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో మై భారత్ నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుగ్గా పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆర్గనైజర్ చల్ల అనుష్, నవతరం యూత్ అధ్యక్షుడు కళ్లెం మనీష్ రెడ్డి, జాగిరి సాయి గణేష్, చల్ల అచ్యుత్, బుర్ర మనోహర్, రాజేందర్, కొత్తూరి రమేష్, కొత్తూరి సాగర్, సాగర్, సాయికుమార్, ఆకాష్, , మధు తదితరులున్నారు.




## మున్నూరు కాపు సంక్షేమ సంఘం భవనం ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** బిఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే కరీంనగర్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దానని మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించిన నిధులతో నిర్మించిన రాంనగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘ భవనాన్ని శనివారం మున్నూరుకాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్‌తో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. బిఆర్‌ఎస్ హయాంలో కరీంనగర్ నగరానికి రూ.1500 కోట్లు తీసుకువచ్చి అభివృద్ద చేశానన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్‌కు రెండు రూపాయలు సైతం కేటాయించలేదని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కరీంనగర్ యువతకు ఉపాధి లభించాలని ఉద్దేశ్యంతో మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టానని, ఆ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేయడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం మారగానే అభివృద్ధి ఆగిపోయిందని , కరీంనగర్ గుడ్డి దీపంగా మారిందన్నారు. రానున్న నగర పాలకసంస్థ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మున్నూరుకాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, స్థానిక డివిజన్ మాజీ కార్పోరేటర్ శ్రీకాంత్, మహేష్, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, నాయకులు మిడిదొడ్డి నవీన్, కాపు కులస్తులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

## బాల బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

**ప్రజాపక్షం/చిగురుమామిడి:** జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విధ్యార్థుల కోసం ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని శనివారం గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో విధ్యార్థుల సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించి పరిశీలనలు చేపట్టారు. ఏఎన్ఎం స్వరూప, ఆశ కార్యకర్త సంధ్యలు విధ్యార్థుల ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి అవసరమైన వైద్య సూచనలు, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాలికల ఆరోగ్యం, పోషణ, వ్యక్తిగత శుభ్రత వంటి అంశాలపై విధ్యార్థులకు విలువైన సూచనలు అందించారు. సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం మెరుగపడితేనే సమాజం ఆరోగ్యవంతంగా ఎదుగుతుందన్నారు. ఉపసర్పంచ్ కాసవేణి జితేందర్, వార్డు సభ్యులు కాసవేని రజినీకాంత్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాధిక్ మసరత్ అలీ తదితరులు పాల్గొని విధ్యార్థులను ప్రోత్సహించారు.

## హుజురాబాద్‌లో సుందరం హోమ్ ఫైనాన్స్ నూతన బ్రాంచ్ ప్రారంభం

**ప్రజాపక్షం/హుజురాబాద్:** సుందరం ఫైనాన్స్ లిమిటెడ్ వారి అనుబంధ సంస్థ సుందరం హోం ఫైనాన్స్ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నూతన బ్రాంచ్‌ను సుందరం హోం ఫైనాన్స్ బిజెనెస్ హెడ్ సురేష్ బాబు, రీజినల్ హెడ్ మల్లేష్, క్లస్టర్ హెడ్స్ అమ్మిరెడ్డి, నాగ రవి ప్రసాద్, యాకయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అందరికి ఇల్లు, ఇంటి రుణం లక్ష్యంగా సుందరం హోం ఫైనాన్స్ అనుగ్రహ అనే హోం లోన్ పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. ఒక లక్ష నుండి 10 కోట్ల రూ.ల వరకు ఉద్యోగస్తులు, వ్యాపారస్తులకు వివిద రుణ పథకాల ద్వారా హోం లోన్, ప్లాట్ లోన్, కమర్షియల్ పర్చేస్, మార్టిగేజ్ రుణాలు అందుబాటులో ఉన్నాయని, లబ్దిదారులు నేరుగా సంప్రదించాలని వారు సూచించారు.

## చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మూర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు పెండ్యాల విమల ఆధ్వర్యంలో వసంత పంచమి పురస్కరించుకొని గ్రామంలోని శ్రీహరిహర క్షేత్రంలో వంద మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ సతిమణి మనాలి ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులతో తానే స్వయంగా అక్షరభ్యాసం చేయించారు. మూర్మూర్‌తోపాటు అంతర్గాం మండలంలోని పలు గ్రామాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరభ్యాసం చేయించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మూర్మూర్, అంతర్గాం గ్రామాల ఉప సర్పంచులు యాదండ్ల సుమన్, డబ్లు.ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పలు గ్రామాల అంగన్వాడీ ఉపాధ్యాయునిలు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ బాలిక దినోత్సవంపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** జాతీయ బాలిక దినోత్సవం సంధర్భంగా బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేష్ ఆద్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. భారత రాజ్యాంగం బాలికలకు కల్పిస్తున్న హక్కులు, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలికలపై లైంగిక వేధింపులను ఎదుర్కోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. విధ్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్దంగా ఉంటుందని పేర్కొన్నారు. లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిరుతపులి దాడిలో లేగదూడ మృతి



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని బాబాయి చెరువు తండా గ్రామ శివారు అటవీ ప్రాంతంలో చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనాదేవి, మండల అటవీ సెక్షన్ అధికారి రంజిత్ కుమార్, బీట్ అధికారి కిరణ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలన చేపట్టారు. లేగదూడ శరీరంపై ఉన్న గాయాలు, పరిసరాల పరిస్థితులను, ఇతర ఆధారాలను పరిశీలించి చిరుతపులి దాడి వల్లే లేగదూడ మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం పంచనామా నిర్వహించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధిత రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం అటవీశాఖ జిల్లా రేంజ్ ఆఫీసర్ మాట్లాడుతూ అటవీ సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి సమయంలో పశువులను సురక్షిత ప్రాంతంలో ఉండేలా చూసుకోవాలని, ఎవరు కూడా ఒంటరిగా అటవీ ప్రాంతాలకు వెళ్లకూడదని తెలిపారు. అలాగే ఏవైనా పుశువులు చిరుతపులి ద్వారా గాని, ఇతర అటవీ జంతువుల ద్వారా గాని చంపబడినట్లయితే వెంటనే స్థానికి అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

## ఫుడ్ బాస్కెట్ పంపిణీ



**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముస్తాబాద్ మండల వైద్యాధికారిణి డాక్టర్ అఫీజ ఆధ్వర్యంలో టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ గంభీరావుపేట క్లస్టర్ 120 మంది టీబీ వ్యాధి బాధితులకు ఫుడ్ బాస్కెట్ పంపిణీ చేశారు . టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టిబి వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకొనట కొరకు సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డా .రజిత పిలుపు మేరకు , పీపుల్స్ హాస్పిటల్ ముస్తాబాద్, డా . శంకర్ 60 మరియు డా,సత్యనారాయణ అశ్విని హాస్పిటల్, ఎల్లారెడ్డిపేట్ 60 మంది క్షయ వ్యాధి గ్రస్తులను న్యూట్రీషన్ ఫుడ్ కొరకు 6 నెలలు పాటు దత్తత తీసుకున్నారు. ఇందులో ప్రతి నెల 600/ విలువ గల బియ్యం, పప్పు, నూనె, పల్లి, గ్రుడ్లు , ప్రోటీన్ పౌడర్ లాంటివి ఇవ్వనున్నట్లు డా. అఫీజ తెలిపారు . ఈ కార్యక్రమంలో టీబి యూనిట్ సూపర్వైజర్ మహిపాల్ ఎస్ టీ ఎస్ టీబి నోడల్ ప్రసాద్ పి హెచ్ ఎన్ జ్యోతి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మల్యాల బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన



**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి కరంజియా నిరోష శనివారం సందర్శించారు.లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు.విద్య యొక్క ప్రాముఖ్యతను వివరంగా తెలియజేశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కుల తో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.గురువులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సమాజం లో మంచి పౌరులుగా ఎదగాలని ఆమె విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుపమ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు ,విద్యార్థులు ,తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహనలో మెగా ఉద్యోగ మేళా విజయవంతం



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** శాతవాహన విశ్వవిద్యాలయంలో మెగా ఉద్యోగ మేళా విజయవంతమైనదని ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ తెలిపారు. శాతవాహన వర్సిటీ నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ కలిసి శనివారం యూనివర్సిటీలో రిజిస్ట్రార్ సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఉద్యోగమేళాకు ముఖ్య అతిథిగా తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి హాజరై ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులు నైపుణ్యాలు పెంచుకోవాలని, సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా తమ విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని , ఈ పోటీ ప్రపంచంలో ముందుండాలంటే ఎప్పటికప్పుడు తమ కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విసి ఉమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ ఉద్యోగమేళా ఆకర్షించడం చదువుతున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఉద్యోగమేళాను కొనసాగించి విశ్వవిద్యాలయ పరిధిలోని విధ్యార్థులకు, జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. విధ్యార్థులు విశ్వవిద్యాలయంలో చేరిన తర్వాత ఉద్యోగంతో బయటికి వెళ్తే బాగుంటుందన్న ఆలోచనతో ఈ ఉద్యోగ మేళాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ అధికారి డా.ఇ.మనోహర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా.రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.పద్మావతి, ఆచార్య సుజాత, డా.శ్రీరంగ ప్రసాద్, ఆచార్య వర ప్రసాద్, కార్తీక్ పొర్లపాటి సమన్వయంతో 67కు పైగా సంస్థలు విచ్చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

## రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజలు రోడ్లపై ప్రయాణించే సమయంలో రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన“అరైవ్–అలైవ్” రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాహనదారులకు,విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. నిబంధనలు పాటించినప్పటికీ, ఎదుటివారి నిర్లక్ష్యం వల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశముందని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడపాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర డీజీపీలు రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రాణాల రక్షణ లక్ష్యంగా ప్రారంభించిన “అరైవ్–అలైవ్” కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామం,పట్టణం, కాలనీ వరకు ప్రజల్లో అవగాహన కల్పించేలా కొనసాగుతుందని తెలిపారు.వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని స్పష్టం చేశారు. అనంతరం వాహనాలకు రోడ్ సేఫ్టీ అవగాహన పోస్టర్లు అట్టించి అధికారులు,వాహనదారులతో కలసి ఎస్పీ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ కృష్ణ, ఆర్.ఐ సురేష్, ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ దిలీప్ సిబ్బంది,నేతాజీ డిగ్రీ కలశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులతో సమావేశం



**ప్రజాపక్షం/రామగిరి:** రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో శనివారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించరూ ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఎస్ఓటు జియం బండి సత్య నారాయణ, లతో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో సెంటినరీ కాలనీలో గల పాడైపోయిన నీటి బోర్లను మరమ్మత్తు చేయించడం, సెంటినరీ కాలనీ లో పాడైపోయిన అంతర్గత రోడ్లను కార్పొరేట్ కార్యాలయం లో మాట్లాడి రోడ్లను మరమ్మత్తు చేయడం,రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో క్రికెట్ ప్రాక్టీస్ కొరకు సింథటిక్ పిచ్ ను ఏర్పాటు చేయడం, సిహెచ్పి కి ఉద్యోగులు వెళ్లే దారిలో గల మట్టి రోడ్డును సిసి లేదా బిటి రోడ్ వేయించడం, డిపార్ట్మెంటులలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు 26 జనవరి,15 ఆగస్టు, సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ఉత్తమ ఉద్యోగి అవార్డు ఇవ్వడం, గ్రేడర్లల తో పాటు అన్ని యంత్రాలలో వేసవికాలం ఏసీలు పనిచేసే విధంగా చూడడం, లాంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు రామారావు, సాయి కృష్ణ, శ్రీనివాస్ రావు, ఎస్వోటుజిఎం యం.ప్రాజెక్ట్ ఆఫీసర్ జె. రాజశేఖర్,ఐ ఇ డిజియం బి.టి. మురళీ కృష్ణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, సిహెచ్పి డిజియం కాశీ విశ్వేశ్వర రావు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు సునీల్ ప్రసాద్, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా వన్యప్రాణుల గణన ప్రారంభం



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా మంథని రేంజ్ పరిధిలోని ముత్తారం మండలంలో వన్యప్రాణుల గణన ప్రారంభమైంది. ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్,మైదంబండ,మచ్చుపెట, ఖమ్మంపల్లి గ్రామాలతోపాటు తదితర గ్రామాల్లోని డీఎఫ్ఓ శివయ్య ఆధ్వర్యంలో వన్యప్రాణుల గణన ప్రారంభమైంది.అటవీ ప్రాంతంలో మంథని సెక్షన్ అధికారి నర్సయ్య తోపాటు బీట్ అధికారులతో డిఎఫ్ఓ కలిసి వన్యప్రాణుల గణన కార్యక్రమంలో భాగంగామండలంలోని మైదంబండ అటవీ ప్రాంతంలో తొలిరోజు గణన చేపట్టారు. దుప్పులు, జింకలు, కొండ గొర్రెలు వంటి జంతువుల వివరాలను పాదముద్రల ఆధారంగా సేకరిస్తున్నట్లు మంథని సెక్షన్ అధికారి తెలిపారు.ఈ గణన వారం రోజులపాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ‘రామునిగుండాల’పై రథసప్తమి వేడుకలు నేడు

**ప్రజాపక్షం/రామగుండం :** శ్రీరామపాద క్షేత్రమైన రామునిగుండాల కొండపై స్వయంభూగా వెలిసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం రథసప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటి ప్రధాన కార్యదర్శి మేడి తిరుపతి తెలిపారు. ఉదయం 1030 గంటలకు శ్రీలక్ష్మీ నృసింహా సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు కొండపై ఉన్న మాడవీధుల్లో శ్రీదేవి భూదేవి సహిత శ్రీవారిని సూర్యప్రభ, గరుడ వాహనాలపై ఊరేగింపు, పల్లకీ సేవ, భజన కీర్తనలు, కోలాటం నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం స్వామివారికి శ్రీసుదర్శన చక్ర స్నానం, సంప్రోక్షణ, అన్నప్రసాద కార్యక్రమాలు జరుపుతున్నట్లు భక్తులు, శ్రీవారి సేవకులు అధికసంఖ్యలో కొండ పైకి తరలిరావాలని ఆయన కోరారు.

## పాఠశాల గేటును అందజేసిన పూర్వ విద్యార్థి శ్రీనివాస్

ప్రజాపక్షం / కోనరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి అయిన పెంతల శ్రీనివాస్ గ్రామంలో పాఠశాలకు ప్రహారీ గోడ నిర్మించారు. కానీ దానికి గేటు లేకపోవడంతో పశువులు, గేదేలు, కుక్కలు, పాఠశాల లోపలికి వచ్చి విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అంతేకాకుండా రాత్రిపూట కొందరు వ్యక్తులు పాఠశాలలో గేటు లేకపోవడంతో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా ఉన్న పెంతల శ్రీనివాస్ తన వంతు సహకారంగా పాఠశాలకు వెనుక వైపు ఉన్న ప్రహారీ గోడ వద్ద గేటును చేయించి పాఠశాలకు అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 39 వార్డులకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో లబ్ధిదారులకు అందించారు. 238 కళ్యాణ లక్ష్మి చెక్కులు,17 షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు ఒక్కొక్కరికి 1,00,116/ రూ అందించారు. ఆర్డీవో సూచనల మేరకు 2,55,29,580/ రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు సిరిసిల్ల తాసిల్దార్ తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వెల్మూల స్వరూప, ఆర్ డిఓ యస్.వెంకటేశ్వర్లు, తాసిల్దార్ మహేష్ కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, మడుపు శ్రీదేవి, వెంగళ లక్ష్మీ నరసయ్య, ఎల్లె లక్ష్మీ నారాయణ,లబ్దిదారులు పాల్గొన్నారు.

# క్రిప్టో కరెన్సీ పేరుతో ఆన్‌లైన్ మోసం

**మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు**

**వివరాలు వెల్లడించిన సిరిసిల్ల సిఐ కృష్ణ**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఈగల్, క్రిప్టో కరన్సీ పేరుతో మల్టి లెవెల్ మార్కటింగ్ అని చెప్పి మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని కొంతమంది వ్యక్తులు కలిసి క్రిప్టో కరన్సీ పేరుతో మల్టి లెవెల్ మార్కటింగ్ అని చెప్పి అమాయకులను చూసుకొని మోసం చేస్తూ ఈగల్ కాయిన్, క్రిప్టో కాయిన్ చైన్ సిస్టం అని చెప్పి అదిక మొత్తంలో ఆన్ లైన్ కంపనీలో ఇన్వెస్ట్మెంట్ చేపిస్తూ కమీషన్లు తీసుకొని ఆన్ లైన్ కంపనీలో 11 లక్షల రూపాయలను ఇన్వెస్ట్మెంట్ చేయగా 18 నెలలో 30 లక్షలు వస్తా యని చెప్పారని కాని ఒక లక్ష ఇరవై వేల రూపాయలు మాత్రమే వచ్చాయని తను పెట్టిన డబ్బులనీ తిరిగి ఇవ్వాలని నిందితులను అడిగితే సమాదానం ఇవ్వలేదని ఇలా చాల మంది ఆన్ లైన్ కంపనీలో పెట్టుబడి పెట్టి నష్ట పోయారని సిరిసిల్ల విద్యానగర్ కు చెందిన ముచ్చ రాజేందర్ ఇచ్చిన పిర్యాదు మేరకు పాశికంటి లవన్ కుమార్, దుమాల ప్రవీణ్,ఆడెపు శ్రీధర్,వంగరి వేణు గోపాల్,మంచికట్ల సుధాకర్,సుభాష్ అనే ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ తెలిపారు. ఆన్ లైన్ కంపనీలో డబ్బులు పెట్టి మోసపోయిన బాదితులు ఇంకా ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలని కోరారు. ఆన్ లైన్ కంపనీలో ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పి అమాయక ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అంజన్న ఆలయానికి ఎలక్ట్రికల్ ఆటో



**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎలక్ట్రికల్ ఆటోను కరీంనగర్‌కు చెందిన వెన్సా ఇన్ఫ్రాస్ట్రక్చర్ రాందేవ్ రావు, లక్ష్మ ణ్ రావులు కలిసి దేవాలయానికి విరాళముగా శనివారం అందజేశారు.ఈ ఆటోచెక్ పోస్ట్ నుండి దేవాలయ ప్రాంగణం వరకు భక్తులను తీసుకువెళ్లడానికి అందుబాటు లో ఉంటుందని ఈవో శ్రీకాంత రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారం ఆదిరెడ్డి,సూపరిండెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి !

**ప్రజాపక్షం/ముత్తారం :** అంగరంగ వైభవంగా జరిగే శ్రీ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు,గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మం పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సందరెల్లి అలాగే మైదంబండ గ్రామాల్లో ఈనెల 28 నుంచి 31 వరకు సాగే శ్రీశ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లును పూర్తి చేశారు.

## ఎస్టి సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడి ఎన్నిక

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** కోరుట్ల నియోజకవర్గ ఎస్టి సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లావత్ రాజేందర్ శనివారం నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా వాల్గొండ తండ సర్పంచ్ ధరం సోత్ సురేందర్, కార్యవర్గ సభ్యులుగా వివిధ గ్రామాల సర్పంచులు ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని ఎస్టి సర్పంచుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తానని, తమను ఎన్నుకున్న ఎస్టి సర్పంచులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులాపూర్ తండ సర్పంచ్ లకావత్ కాంతి జవహర్లాల్, తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు. తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటించడం వాహనదారుల బాధ్యత

**రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమే**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**చిన్న చిన్న పొరపాట్లతో పెద్ద ప్రమాదాలు**

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




**ప్రజా పక్షం/ వేములవాడ :** ట్రాఫిక్ రూల్స్ పాటించడం వాహనదారుల సామాజిక బాధ్యత అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో అరైవ్.. అలైవ్.. అలెర్ట్, రన్ ఫర్ రోడ్ సేఫ్టీ 2కే వాకథాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్ పాటించడం పై విద్యార్థులు డ్యాన్స్ ప్రదర్శన ఆకట్టుకున్నది. డ్రంక్ అండ్ డ్రైవ్.. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడంతో జరిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శన ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసింది. 2కే వాకథాన్ ను ప్రభుత్వ విప్, చొప్పదండి ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి చౌరస్తా నుంచి కోర్ట్ కాంప్లెక్స్ వద్ద ఉన్న మైదానం వరకు ముఖ్య అతిథులు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రమాదాలు నివారణకు ఆలోచన వచ్చిన వెంటనే వివిధ చర్యలను ఆచరణలో పెట్టిందని వెల్లడించారు. రోడ్డు పైకే వచ్చే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, దీంతో మీకు.. అలాగే రోడ్డుపై ప్రయాణించే మిగితా వాహనదారులు, రోడ్డు వెంట వెళ్ళే వారి రక్షణకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. మనిషి ప్రాణం చాలా విలువైనదని పేర్కొన్నారు. ఒక రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద మరణిస్తే బాదిత కుటుంబం జీవితాంతం బాధపడాల్సి వస్తుందని, ఆ ఇబ్బందులు వర్ణనాతీతమని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులే ఇబ్బంది పడుతున్నారని, వారితో కచ్చితంగా హెల్మెట్ ధరింపజేయాలని, ప్రమాదాల బారి నుంచి రక్షించాలనే సద్దుదేశంతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేపట్టిన నో హెల్మెట్ ..నో పెట్రోల్ కార్యక్రమాన్ని అభినందించారు. పెట్రోల్ బంకు యజమానులు సామాజిక బాధ్యతగా హెల్మెట్ లేకుండా వచ్చే వారికి పెట్రోల్ పోయవద్దని పిలుపునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, ఒక వేళ తాగితే వాహనాలపై ప్రయాణాలు చేయవద్దని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ శాఖ అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రవాణా శాఖ కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు.

## అంబేద్కర్ చిత్ర పటంతో గణతంత్ర వేడుకలు జరపాలి

**ఎడిఎస్ఎస్ ప్రధానకార్యదర్శి**

**కొయ్యల నర్సింహారావు**

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** భారత రాజ్యాంగ నిర్మాత దళిత బహుజన వర్గాల విమోచకుడు భారత గణతంత్రానికి పునాది వేసిన మహానాయకుడు డాక్టర్, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని గణతంత్ర దినోత్సవం రోజున ప్రతి గ్రామంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యం గా నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీ కార్యాల యా ల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేసి జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏ టూరునాగారం మండలం డిప్యుటీ తాసిల్దార్ కి దళిత ఉ ద్యమ నాయకులు వినతిపత్రం అందజేశారు. దళిత స ంఘాల ఆధ్వర్యంలో ఏజెన్సీ దళిత సేవా సంఘం (ఎడిఎస్ఎస్) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కోయ్యల నర్సింహారావు ఏంఆర్పిఎస్ ములుగు జిల్లా నాయకులు ఎంపెల్లి శంకర్, తదితర నాయకులు గ్రామ స్థాయి కార్యకర్తలతో క లిసి ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకుని అధికారికంగా వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో ముఖ్యంగా గణతంత్ర దినోత్సవం అనేది కేవలం జెండా ఎగరేసే కార్యక్రమం మాత్రమే కాకుండా భారత రాజ్యాంగ విలువలను ప్రజలకు గుర్తు చేసే పవిత్ర సందర్భమని పేర్కొన్నారు. రా జ్యాంగం లేకపోతే ఈ దేశంలో కోట్లాది మంది బడుగు బ లహీన దళిత, ఆదివాసీ, మైనార్టీ వర్గాలకు సమాన హ క్కులు సమాన అవకాశాలు ఉండేవి కావని నాయకులు స్ప ష్టం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లేకపోతే ఈ దేశంలో ఓ టు హక్కు విద్యా హక్కు ఉద్యోగ అవకాశాలు చట్టపరమైన రక్ష ణలు బహుజనులకు దక్కేవి కావని తెలిపారు. అ లాంటి మహానాయకుడి చిత్ర పటాన్ని గణతంత్ర దినోత్స వం రోజున ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టకపోవడం అ నేది రాజ్యాంగ ఆత్మకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో జెండా ఆవిష్కరణ జరుగుతున్నప్పటికీ రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ చిత్ర పటానికి తగిన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ము ఖ్యంగా కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాల్లో కూడా అంబేద్కర్ ఫోటో లేకుండా కార్యక్రమాలు నిర్వహించడం బాధాకరమన్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అమలు చేయాలి.

## చేనేత ఐక్య వేదిక మండల అధ్యక్షుడి నియామకం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** తెలంగాణ చేనేత ఐక్యవేదిక మండల అధ్యక్షుడిగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రంగదాముని పల్లి గ్రామానికి చెందిన పెద్దూరి కుమారస్వామిని నియమించినట్లు తెలంగాణ చేనేత ఐక్యవేదిక క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు గాజుల గంగ మల్లేశం తెలిపారు . ఈ మేరకు శనివారం కుమార స్వామికి క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు గంగ మల్లేశం చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కుమార స్వామి మాట్లాడుతూ చేనేత ఐక్యవేదిక మండల అధ్యక్షుడిగా నియమించినందుకు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని అన్నారు. నా నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల సురేష్, రాష్ట్ర చేనేత ఐక్య వేదిక క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు గాజుల గంగ మల్లేశం కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ ,మల్లేశం, జలంధర్,తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ విద్యార్థులకు టీ షర్టులు అందజేత



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బర్దిపూర్ గ్రామంలోని పాఠశాలలో బాల బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులకు టీ షర్టులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంఘం సాగర్ తన సొంత డబ్బులతో విద్యార్థులకు ప్రత్యేక ఆకర్ష ణ కోసం టి షర్టులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చి శ్రద్ధగా చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సాగర్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భీంకర్ అఖిలేష్, పంచాయతీ కార్యదర్శి దివాకర్,ప్రధానోపాధ్యాయుడు పవన్,, మాజీ ఎస్ఎంసి చైర్మన్ సదానందం, ప్రదీప్, సాయి, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని వేంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా మచ్చర్ల శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం శివాలయంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ముచ్చర్ల శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షుడిగా జక్కని రఘు, కోశాధి కారిగా వెలుమల నరేష్ లతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు అన్ని కులాల పెద్ద మనుషు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభి వృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు.

## నూతన తహసీల్దార్‌కు సన్మానం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఇటీవలే మల్లాపూర్ మండలానికి నూతనంగా విచ్చేసిన ఇన్చార్జి తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు శనివారం గుండంపల్లి సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్య, ఉప సర్పంచ్ గంగాధర్,కుస్తాపూర్ సర్పంచ్ జెల్లా రాజు, ఉప సర్పంచ్ సరికేల మహిపాల్‌లు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. వీరి వెంట కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆమ్ ఆద్మీ పార్టీలోకి గోల్కొండ రాజమణి..



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:ఆమ్ ఆద్మీ పార్టీ మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు సాగుతోందని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ,నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ అన్నారు.శనివారం పార్టీ సిద్ధాంతాలు,ప్రజాపక్ష విధానాలకు ఆకర్షితులై గోల్కొండ రాజమణి ఆమ్ ఆద్మీ పార్టీ కండువా కప్పి సయ్యద్ హైదర్ ఘనంగా స్వాగతం పలికారు.కార్యక్రమంలో మాట్లాడిన ఆయన,మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.పార్టీలో చేరిన అనంతరం గోల్కొండ రాజమణి మాట్లాడుతూ,ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాల్లోచురుగ్గా పాల్గొంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మదర్‌ట్రీ ఏర్పాటు



ప్రజాపక్షం/భీమ్‌గల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమీషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూయేషన్ సూచనలననుసరించి శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మదర్ టీ' (మాతృ వృక్షం) కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ తెలిపారు. జువాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ఆధ్వర్యంలో అధ్యాపకులు శంకర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించామని, వాతావరణ పరిరక్షణలో భాగంగా చెట్ల సంరక్షణపై అవగాహన పెంపొందించటమే లక్ష్యంగా మదర్ ట్రీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రాంగణంలోని కానుగ (పొంగామియా పిన్నిటి) మాతృ వృక్షంగా ఎంపిక చేసి చెట్టు చుట్టూ ప్రత్యేక ఏర్పాట్లు చేసి పూజలు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# సమాఖ్య సంఘ సమావేశం



ప్రజాపక్షం/తానూర్:తానూర్ మండల సమాఖ్య భవనంలో శనివారం సంస్థాగత నిర్మాణం,పదాధికారుల విధులు,బాధ్యతలు,ఆర్థిక అంశాలు నియమాల,గురించి సీనియర్ సీఆర్పీ లత,రమాదేవి ఆధ్వర్యంలో మండల సమాఖ్య ఓబీ,లకు ఈసీ,లకు,జీబీలకు శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు మంగళ,కార్యదర్శి పద్మ,కోశాధికారి సరోజన,గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు ఏపిఎం సులోచనరెడ్డి,సీసీలు భోజన్న,సవిత,సరస్వతి,పోశెట్టి,అకౌంటెంట్ దత్తు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు పిల్లల జీవితానికి రక్షణ కల్పించాలి

ఎస్‌పి శ్రీనివాస్



ప్రజాపక్షం/బోధన్:వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ వారి కుటుంబ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని, వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం వహించకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ లాంటివి ధరించి వాహనాలు నడుపుతూ పిల్ల జీవితానికి రక్షణ కల్పించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ఇందూరు ప్రైమరీ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు రోడ్డు రక్షణ ట్రాఫిక్ నియమాలపై వివరణాత్మక ప్రదర్శన చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన వాటిని ఎసిపి శ్రీనివాస్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిల్లలు తల్లిదండ్రులు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటించేలా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్ బెల్టు ధరించి వాహనాలు నడిపే విధంగా విద్యార్థులకు సూచించారు. వాహనాలు నడిపించేటప్పుడు నిర్లక్ష్యం వహిస్తే మీ భవిష్యత్తును గురించి ఒకసారి ఆలోచించే విధంగా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాలపై ప్రదర్శన నిర్వహించినందుకు పాఠశాల బృందాన్ని మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ సిఐ వెంకట్ నారాయణ, ఎస్సై భాస్కరాచారి, ట్రస్మా పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ, ఇందూరు ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశాల ప్రారంభోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ



ప్రజాపక్షం/ముథోల్:మండల కేంద్రమైన ముధోల్ లోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశాల ప్రారంభోత్సవ కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ షబానా బేగం ఏజాజుద్దీన్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి పాఠశాలలో ప్రవేశాలకు ఆన్లైన్ ప్రక్రియలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు.పోషకులు సైతం తమ వంతు బాధ్యతగా తమ బాలికల ఉజ్వల భవిష్యత్తుకై మైనారిటీ గురుకులాల్లో చేర్పించాలని సూచించారు.పాఠశాలల్లో విద్యార్థులు చేరే విధంగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.మైనారిటీ గురుకులాల్లో చదివిన విద్యార్థినిలు ఉన్నత విద్యలో రాణించడం ఆనందం కలిగిస్తుందన్నారు.ప్రభుత్వం బాలికల విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.విద్యతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు.మైనారిటీ గురుకుల పాఠశాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.విద్యార్థినులకు కేజీ టు పీజీ విద్య అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.పదో తరగతి,ఇంటర్లో మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇంజనీరింగ్,అగ్రికల్చర్,ఎంబిబిఎస్ లో సీట్లు సాధించడం గర్వకారణము అన్నారు.విద్యార్థినులను మైనారిటీ గురుకులాల్లో చేరే విధంగా పోషకులను ప్రోత్సహించాలని ప్రజా ప్రతినిధులు,నాయకులను కోరారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ డి.జ్యోతి సర్పంచును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్,నాయకులు హఫీజ్ అబ్దుల్ ఖవి,షకీల్ ఖాన్,వార్డు సభ్యులు అబ్దుల్ ఖాలిక్,బషీర్ అహ్మద్,నాయకులు నజీర్,అజర్,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓ కార్యాలయంలో దుర్గంధం

ప్రజాపక్షం/ఎడపలి:అది మండల ప్రజల సమస్యలను తీర్చాల్సిన అత్యున్నత కార్యాలయం గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని ఆదేశాలు జారీ చేయాల్సిన చోటు కానీ, అక్కడే పారిశుద్ధ్యం పడకేసింది. ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ప్రస్తుతం దుర్వాసనకు నిలయంగా మారింది. కార్యాలయంలోని మరుగుదొడ్డి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారవ్వడంతో అటు సిబ్బంది, ఇటు వచ్చే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

**పట్టించుకోని సిబ్బంది.. బెంబేలెత్తుతున్న ప్రజలు**

కార్యాలయ ఆవరణలోకి అడుగు పెట్టగానే ముక్కుపుటాలదిరేలా దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణకు అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి లోపలికి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో నిత్యం పని చేసే సిబ్బంది కూడా ఈ వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



**కంచే చేను మేసినట్లు.. అధికారుల నిర్లక్ష్యం..**

కార్యాలయంలోనే పారిశుద్ధ్యం ఇలా ఉంటే ఇక గ్రామాలను పట్టించుకునే వారెవరు..? అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామాలకు దిశానిర్దేశం చేయాల్సిన ఎంపీడీఓ కార్యాలయంలోనే ఈ పరిస్థితి ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. పారిశుద్ధ్యంపై చిన్న చూపు చూస్తున్న తీరుపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కార్యాలయ ఆవరణలో అపరిశుభ్రతను తొలగించి, మరుగుదొడ్లను వెంటనే శుభ్రం చేయించాలని ఎడపల్లి మండల ప్రజలు కోరుతున్నారు.

# కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

ప్రజాపక్షం/నిజాంసాగర్: కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26 గణతంత్ర దినోత్సవం రోజున జెండా ఆవిష్కరణ అనంతరం తీర్మాణం చేయాలని కామారెడ్డి జిల్లా డిసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ శనివారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర్య దినోత్సవం రోజున జజెండా ఆవిష్కరణ అనంతరం కామారెడ్డి జిల్లాలోని 4 నియోజకవర్గాల పరిధిలోని ప్రతీ గ్రామపంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం పునరుద్ధరణ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మాణం చేయాలన్నారు. ప్రజలకు ఉపాధిహక్కు, పంచాయతీలకు పాలన హక్కులు తిరిగి కల్పించాలని, కేంద్రంలో బీజేపి ప్రభుత్వం ప్రజల ఉపాధి హక్కును కాలరాస్తూ పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన అధికారాలను నిర్వీర్యం పూర్తిగా తిరస్కరిస్తుందని పేర్కొన్నారు.

# ఘనంగా జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమం



ప్రజాపక్షం/నేరడిగొండ:నేరడిగొండ మండల కేంద్రంలోని నాలుగవ నెంబర్ అంగన్వాడీ కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ మంజుల, ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బేటి పడావో బేటి బచావో పథకంలో భాగంగా పిల్లల ముందర కేక్ కట్ చేసి బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.మండలంలోని పురవీధుల గుండా బాలికల చదువు అభివృద్ధిపై ర్యాలీ నిర్వహించిన అనంతరం సమావేశంలో మాట్లాడుతూ బాలికల చదువు ఒక కుటుంబాన్ని ఏ విధంగా ఉన్నతంగా మారుస్తుందో ప్రతి ఒక్క కుటుంబం తెలుసుకోవాలని బాలికల అభివృద్ధికై పాటుపడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, మండలంలోని అంగన్వాడీ టీచర్లు, శ్రీలత, ప్రేమ, భూమవ్వ, సంధ్యారాణి, సూర్యకళ, నాగమణి, తల్లిదండ్రులు పోషకులు, పాల్గొన్నారు.

**బోథ్:**జాతీయ బాలికల దినోత్సవన్ని పురస్కరించుకొని మండల న్యాయ సేవధికార సంస్థ బోథ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కే.సందీప్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలికల హక్కులు కాపాడబడాలంటే పాఠశాల స్థాయి నుండే బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని అన్నారు.బాలిక విద్య పోక్సో బాల్య వివాహాలు సైబర్ క్రైమ్స్, సమానత్వ హక్కుల గురించి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏజీపి పంద్రం శంకర్, సీనియర్ న్యాయవాది మోహన్ రావ్, కుమ్మరి విజయ్ కుమార్, దమ్మాపాల్, సి.ఐ.గురుస్వామి, ఎస్.ఐ.పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు ఆశ్రం శంకర్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థలం లేదనడం అవాస్తవం..



ప్రజాపక్షం/ఖానాపూర్:ఖానాపూర్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు స్థలం లేదని కాంగ్రెస్ నాయకుల ఆరోపణల్లో నిజం లేదని ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన జేఏసీ కమిటీ సభ్యులు అన్నారు.శనివారం ఖానాపూర్ పట్టణంలోని విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఖానాపూర్ పట్టణంలో స్థలం లేక ఉట్నూర్‌కి తరలిస్తున్నామని రెండవది మంజూరు చేసి ఇస్తామంటున్నారు.మొదటి సారి మంజూరైన స్కూల్ కు స్థలం లేదు.మరి రెండో స్కూల్ మంజూరికి స్థలం ఎక్కడి నుండి ఇస్తారని కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని జేఏసీ నాయకులు అన్నారు.ఇది ఖానాపూర్ ప్రజలను మోసం చేయడం కాదా నిలదీశారు.ఖానాపూర్‌లో స్థలముందని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించిన పత్రాలు చూపిస్తామని,వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నుండి ఉట్నూర్ (బైఫర్ కేషన్) వేరు పడి కొత్త నియోజకవర్గం అవుతుందనే ఆలోచనతో ఎమ్మెల్యే ఖానాపూర్ ప్రాంతం పై వివక్షతో ఉట్నూర్ ప్రాంతం కు తరలిస్తున్నారని పలకడం సిగ్గుచేటని,కాంగ్రెస్ నాయకులు రాజకీయ లబ్ది కోసం పదవుల కోసం ఖానాపూర్ ప్రాంతానికి ద్రోహం చేస్తున్నారన్నారు.స్కూల్ ను ఉట్నూర్ కు తరలించవద్దు ఖానాపూర్ లోనే శంకుస్థాపన చేయాలి దీనికి ప్రతి ఒకరు సహకరించాలని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ కన్వీనర్ సాగి లక్ష్మణ్ రావు,జేఏసీ కొ కన్వీనర్ కొండాడి గంగారావు,జేఏసీ కో కన్వీనర్ రాజన్న,జేఏసీ ప్రధాన కార్యదర్శి కాశవేణి ప్రణయ్ కుమార్,జేఏసీ కోశాధికారి ఎనగందుల నారాయణ,జేఏసీ ముఖ్య సలహా దారులు పుప్పాల సతీష్,తంగళ్ళపెల్లి రాజశేఖర్,అడిదెల మహేష్,జీవన్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ బరిలో జనసేన

**ప్రజాపక్షం/భీమ్‌గల్:**మున్సిపాలిటీలో రాబోయే ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ తమ రాజకీయ వ్యూహాన్ని వేగవంతం చేసింది. శనివారం భీమ్‌గల్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు కీలక ప్రకటన చేశారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం ప్రతి వార్డులలో జనసేన పార్టీ అభ్యర్థులు పోటీ చేయబోతున్నారు. ప్రజాసేవ చేయాలనే తపన, నిబద్ధత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నాము. ఆసక్తి కలిగిన వారు తక్షణమే భీమ్‌గల్‌లోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరుతున్నాము. అవినీతి రహిత పాలన, స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనసేన ఈ ఎన్నికల్లో ముందుకెళుతోంది. మార్పు కోరుకునే వారు, జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పార్టీ తరపున పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ శివసారి ఫణీంద్ర, మండల కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, బి. దిలీప్, నవీన్, ప్రసన్న, రమేష్ పాల్గొన్నారు.

## యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షల్లో ఉషోదయ విద్యార్థుల విజయకేతనం

**ప్రజాపక్షం/బోధన్:**తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో బోధన్ పట్టణ ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ముగ్గురు పదికి పది జిపిఏ సాధించి ప్రభంజనం సృష్టించారని ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ సూర్య ప్రకాష్ తెలిపారు. శనివారం కళాశాల ప్రాగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విశ్వ విద్యాలయం పరిధిలో 63అనుబంధ కళాశాలలు, విద్యార్థులు 682మంది పరీక్షలు వ్రాయగా వారి కళాశాల విద్యార్థులు ముగ్గురు, ఇక్ర మహవీన్, సల్మా తబసుమ్, ఇఫ్రా హాని లు పదికి పది జిపిఎ సాధించారని, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో మరో విద్యార్థిని సంజన పదికి పది జిపిఎ సాధించి వారి సత్తాను చాటారని కళాశాలకు గర్వకారణంగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీలకు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బృందం తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల ఆసక్తి వాసురాంను కెప్టెన్ చేసింది

**ప్రజాపక్షం/పిట్లం:**క్రీడల పట్ల వాసురాంకు ఉన్న ఆసక్తి ఆయన్ను కెప్టెన్ చేసిందని వాసురాం ఎంపికైన వర్సిటీ క్రీడా కోఆర్డినేటర్ ఆర్. గోపాల్ పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం నాగంపల్లి తాండాకు చెందిన గిరిజన యువకుడు వాసురాం నిరంతర అంకితభావం, క్రమ శిక్షణతో విశ్వ విద్యాలయ స్థాయి జట్టుకు సారథ్యం వహించే గౌరవాన్ని దక్కించుకున్నారు. ఈనెల 26న ప్రారంభం కానున్న ఆలిండియా సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ కొరకు వాసురాం ఎంపికపై పిట్లం మండల వాసులు, ప్రజాప్రతినిదులు, తాండాపెద్దలు హర్షం వ్యక్తం చేశారు. క్రికెట్ పట్ల మక్కువ ఉన్నప్పటికి ఇతర క్రీడల్లోనూ వాసురాం తన ముద్ర వేశారు. గతంలో 3 కి.మీ వాక్ రేసులో శ్రమించి గోల్డ్‌మెడల్ సాదించారు. హ్యాండ్‌బాల్, ఖోఖో వంటి క్రీడల్లో జాతీయ స్థాయిలో రెజ్లింగ్‌లో కాంస్య పతకం గెలుచుకున్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:**దిలావర్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవంను ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కేంద్ర ఎన్నికల సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొని ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్ మాట్లాడుతూ,ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుదమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని,ఎన్నికల సమయంలో బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించాలని సూచించారు.18 ఏళ్లు నిండిన విద్యార్థులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.మద్యం,డబ్బు వంటి ప్రలోభాలకు లోను కాకుండా నైతిక విలువలతో ఓటు వేయాలన్నారు.నమసమాజ నిర్మాణం కోసం కుల,మత,ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఓటు వేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కృష్ణ, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



**కుంటాల:**ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసిల్దార్ కమల్ సింగ్ అన్నారు.శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని,విద్యార్థులతో ప్రధాన విధులగుండా ర్యాలీ నిర్వహించారు.స్థానిక బస్టాండ్ ఆవరణలో విద్యార్థులకు ఓటరు దినోత్సవంపై అవగాహన కల్పించారు.ప్రతిజ్ఞ చేశారు.సీనియర్ సిటిజన్లను తహసిల్దార్ కమల్ సింగ్,శాలువ,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల గజేంధర్,ఎంపీడీవో అల్లాడి వనజ,ఎంఈవో ముత్యం,రెవెన్యూ సిబ్బంది,బి.ఎల్.వోలు పంచాయతీ కార్యదర్శి రాజ బాపు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




**బైంసా :**బైంసా పట్టణంలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవంను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఓటరు ప్రాముఖ్యత,ఓటు హక్కు విలువ,ప్రజాస్వామ్యంలో యువత పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య విద్యార్థును ఉద్దేశించి ఓటరు హక్కు ఎంత విలువైనదో,ప్రతి పౌరుడు బాధ్యతగా ఓటు వినియోగించుకోవాల్సిన అవసరాన్ని విస్తృతంగా వివరించారు.ఈ కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం యూనిట్1, యూనిట్2,పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించాయి.కార్యక్రమానికి ప్రధాన స్పీకర్‌గా హాజరైన పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు టి. సురేందర్ ఓటు హక్కు,దాని విధులు,ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు పాత్రపై విద్యార్థులకు స్పష్టంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు,అధ్యాపకులు అందరూ కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆరే రాజు,డా.జాదవ్ ఓం ప్రకాష్,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్,అధ్యాపకులు డి.పవన్ కుమార్,యు.రవి కుమార్,డా.శంకర్,గుంత సుధాకర్, సంతోష్ కుమార్, డా.కల్పన, దివ్య,నహదా, కిషన్, రామ్మోహన్, రాజయ్య, అబ్దుల్లా, శ్రావణ్య, ఇర్ఫాన్, వాహీద్, ఆఫ్రీన్ సుల్తానా, ఉజుమా తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూం కాలనీని వార్డుగా ఏర్పాటు చేయాలి..

**ప్రజాపక్షం/ఖానాపూర్:**ఖానాపూర్ పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీని ప్రత్యేక మున్సిపల్ వార్డుగా ఏర్పాటు చేయాలని పిటిషనర్ నంది రామయ్య,కాలనీ నిర్వాసితులతో కలిసి డిమాండ్ చేశారు.ప్రత్యేక వార్డును కోరుతూ కాలనీ ప్రజలు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి హియరింగ్ అవకాశం కల్పించాగా కోర్టు ఆదేశానుసారం శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలంలో కమిషనర్ ఆధ్వర్యంలో కాలనీవాసులతో హియరింగ్ ఏర్పాటు చేసినట్లు పిటిషనర్ నంది రామయ్య తెలిపారు. కాలనీ ప్రజలు, పిటిషనర్ నంది రామయ్య, మాట్లాడుతూ సుమారు 1500 మంది జనాభా కలిగిన డబుల్ బెడ్రూం కాలనీని ప్రత్యేక మున్సిపల్ వార్డుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కాలనీ వాసులను వివిధ వార్డుల్లో చేర్చడంతో పరిపాలన ప్రాతినిధ్యం వహించడం లేదని,దీంతో పారిశుధ్యం,త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణలు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.మున్సిపల్ చట్ట ప్రకారం కమిషనర్ కున్న అధికారాలు వినియోగించి వార్డుల పునర్విభజన ప్రారంభించి డబుల్ బెడ్రూం ను ప్రత్యేక వార్డుగా ఏర్పాటు చేయాలని కోరారు.హియరింగ్ అనంతరం కాలనీ ప్రజల విన్నపాలను ఉన్నతాధికారులతో పాటు హైకోర్టుకు తెలియజేస్తామని మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ పేర్కొనోనట్లు పిటిషనర్ నంది రామయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో పిటిషనర్ అఖిల్, షేక్ అహ్మద్ , సునీల్, పద్మ, చందన్న, అజీమ్, గోరేమియా, రాజ నర్సయ్య, అభివృద్ధి కమిటి సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు ప్యాడ్లు అందజేత..

**ప్రజాపక్షం/తానూర్:**పదో తరగితి చదువుతున్న విద్యార్థులకు ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్ ట్రస్ట్ టీం సభ్యులు శనివారం మండల కేంద్ర జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు,స్థానిక,మండల నాయకుల తో కలిసి ఎగ్జామ్ ప్యాడ్లు అందచేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రజా ట్రస్ట్ టీం సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని,ఉపాధ్యాయులు నేర్పించే పాఠాలను శ్రద్ధతో విని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు.విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,గ్రామ వార్డు సభ్యులు,ట్రస్ట్ టీం సభ్యులు,మండల స్థానిక నాయకులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడిగా పతాని కృష్ణ

**ప్రజాపక్షం/భీమ్‌గల్:**సర్వసమాజ్ కమిటీ అధ్యక్షునిగా పతాని కృ ష్ణ ఎన్నికయ్యారు. శనివారం జరిగిన సర్వసమాజ్ కమిటీ భవనం లో ఎన్నికలు నిర్వహించగా ఉపాధ్యక్షులుగా రఘు, కోశాధికారిగా భూమేష్, రైటర్‌గా నిచ్చమొల్ల రాజేశ్వర్ ఎన్నికైనట్లు తెలిపారు. ప ట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యుల ను పట్టణ వాసులు ఘనంగా సన్మానించారు. జాతీయ సేవా పథకంభాగాలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ ఎన్నికల్లో భా గంగా పట్టణానికి చెందిన అన్ని కుల సంఘాల సభ్యులు ఎన్నికల్లో పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు పునాది బాలికలే



**ప్రజాపక్షం/నిజామాబాద్‌అర్బన్:** భవిష్యత్ తరాలకు పునాది బాలికలేనని, బాలికా హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. శనివారం స్తానిక న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉమెన్, చిల్డ్రన్, డిజబుల్డ్, సీనియర్ సిటిజన్ శాఖ వారి ఆద్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల చదువు దేశాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. బాలికల అభ్యున్నతి కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తు బాలికల భవిష్యత్తు, భద్రత కోసం సుకన్య సమృద్ధి యోజన, బేటి బచావో, బేటి పడావో, పోషకాహారం కోసం పిఎంపోషణ్ పథకం, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్య కోసం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలువంటి పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. బాలికలపై దాడులు లేని సమాజాన్ని సాధించుకుందామని పిలుపునిచ్చారు. బాలికల చదువుల విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరిని చదివించాలన్నారు. ఈ సందర్భంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలకి జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ పద్మలత, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బి, డిస్టిక్ స్పోర్ట్స్ ఆఫీసర్ పవన్ కుమార్, సిడిపివోలు సౌందర్య, పద్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై,బెల్ట్,ఐడీ కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/సారంగాపూర్:**మండలంలోని చించోలి(బి) గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తడక చంద్రశేఖర్ ఉదారత చాటుకున్నారు.పాఠశాల ఉపాధ్యాయుల విన్నపం మేరకు స్పందించిన ఆయన,తన సొంత ఖర్చులతో విద్యార్థులకు అవసరమైన టైలు,బెల్టులు,ఐడి కార్డులను అందజేశారు.శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులు పాల్గొని విద్యార్థులకు వీటిని అందజేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఇలాంటి చేయూతనివ్వడం అభినందనీయమని,ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వన్నెల సాయన్న,మాజీ వీడీసీ అధ్యక్షుడు పోశెట్టి,ఏఎంసీ డైరెక్టర్ అహ్మద్ ముక్తార్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నేరడిగొండ:**మండలంలోని బంధం రేగడి గ్రామపంచాయతీలో నూతనంగా మంజూరైన పంచాయితీ భవనం పాఠశాల ప్రహరీ గోడ,కిచెన్ షెడ్ నిర్మాణాలకై 36 లక్షల నిధులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,చేతులమీదుగా శనివారం భూమి పూజ చేశారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,మండల అభివృద్ధి అధికారి శేఖర్,మండల నాయకులు రాథోడ్ సజన్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి లబ్ధిదారునికి చేయూత పెన్షన్ అందించాలి

**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** ప్రతి లబ్ధిదారునికి చేయూత పెన్షన్ సరైన సమయంలో అందేలా బిపిఎంలు కృషి చేయాలని ఎలకపల్లి గ్రామ సర్పంచ్ భక్తు రాంచందర్ అన్నారు. శనివారం గ్రామంలో పెన్షన్ల పంపిణీ విధానాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం సక్రమంగా చేరాలన్నారు. వికలాంగులకు నాలుగు వేల పదహారు రూపాయలు, వితంతువులు ఇతర లబ్ధిదారులకు రెండు వేల పదహారు రూపాయలను చిల్లరతో సహా పూర్తి నగదును అందజేయాలని సూచించారు. పెన్షన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సహకరించాలని కోరారు.

## ఇపి ఆపరేటర్లపై వేధింపులు ఆపాలి

### హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి

**ప్రజాపక్షం/నస్పూర్ :** సింగరేణి యాజమాన్యం అనాలోచిత నిర్ణయాలతో ఈపి ఆపరేటర్లను శారీరక మానసిక వేధింపులకు గురి చేస్తోందని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి విమర్శించారు. శ్రీరాంపూర్ ఒసిపి నుండి ఆపరేటర్లను ఇందారం ఒసిపికి డిప్యూటేషన్ పై పంపి, వెంటనే ఆర్జి 2 ఏరియా ఆపరేటర్లను శ్రీరాంపూర్ రావాలని సర్క్యులర్ జారీ చేయడంపై ఆయన మండిపడ్డారు. శ్రీరాంపూర్ లో సిబ్బంది అవసరం ఉన్నప్పుడు ఇక్కడి వారిని ఇందారంకు ఎందుకు పంపారో యాజమాన్యం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. నేరుగా ఆర్జి ఓసి 2 నుండి ఇందారంకు పంపే అవకాశం ఉన్నా ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో శ్రీరాంపూర్, ఇందారం నుండి 18 మందిని మణుగూరుకు పంపారని, పైరవీకారుల జోక్యంతో కొంతమందిని ఇక్కడే ఉంచి మిగిలిన వారిని ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ఈపి ఆపరేటర్లపై వేధింపులు ఆపాలని అన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ



**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులు పోతుగల్ సర్పంచ్ పెద్ది గారి యాదమ్మ శ్రీనివాస్ చేతుల మీదిగా పంపిణీ చేశారు. అయిన చెక్కపెల్లి రామకృష్ణ కు 60,000/రూపాయలు, మర్రిపెల్లి లక్ష్మికి 25,000 రూపాయలు, మర్రిపెల్లి మధుకి 22,000/రూపాయలు, మాచర్ల రాఖేష్ గకి 30,000/ రూపాయలు. మొత్తం: 1,27,000/ రూపాయల చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అన్నమేని రాజు మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ది గారి శ్రీనివాస్ మరియు, తోట ధర్మేందర్, మామిండ్ల ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కేసుగాని చంద్రమౌళి, రమేష్ రావు, వెంకటేష్, హరిబాబు, శ్రీనివాస్, దేవయ్య, మరియు గ్రామ కుల ప్రముఖులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. శనివారం కాగజ్ నగర్ మండలం గన్నారం గ్రామంలోని జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లిన కలెక్టర్ విద్యా బోధన విధానం, మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని పరీక్షలకు సన్నద్ధం చేయాలని, విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూడాలని ప్రిన్సిపల్ కు సూచించారు. పాఠశాలలో మెనూ పట్టిక, ఆహార నాణ్యత, వంటశాల పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు పండ్లు సరఫరా చేయని గుత్తేదారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నాణ్యమైన పండ్లను సకాలంలో అందించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. గురుకులానికి ప్రహరీ గోడ నిర్మాణానికి అంచనా ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం




**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** చదువుతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమని కాగజ్ నగర్ డిఎస్‌పి వహీవద్దీన్ అన్నారు. శనివారం కాగజ్ నగర్ పట్టణంలోని అన్వర్ ఉర్దూ పాఠశాలలో అబిద్ అలీఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా క్వశ్చన్ బ్యాంకులు, ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అన్వర్ ఉర్దూ పాఠశాల, ఎగ్బాల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాల, ఆర్బి పాఠశాల విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలని కోరారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి గురువులు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని మండల విద్యాధికారి ప్రభాకర్ ఆకాంక్షించారు. లక్ష్యసాధనతో ముందుకు సాగినప్పుడే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. విద్యారంగ అభివృద్ధికి ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, రూరల్ సిఐ కుమారస్వామి, ప్రధాన ఉపాధ్యాయులు ఆరిఫ్ ఉద్దీన్, తాటి రవీందర్, ట్రస్ట్ జిల్లా ఇంచార్జ్ అబ్దుల్ జమీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి రమేష్ బాబు విద్యార్థులకు బాలికల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అడ్వకేట్ గణపతి బాలికలకు ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించగా, పోలీస్ కానిస్టేబుల్ శ్యామ్ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గోపి కిషోర్ ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలికల సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ శ్యామ్, బ్యాంకు మేనేజర్ గోపి కిషోర్, ఉపాధ్యాయులు యాదగిరి, ఎస్.కె భాషా, గంగాభవాని, ఆత్మారాం, ఈశ్వర్, భారతి, ఉజ్వల, సంతోష్, సమ్మయ్య పాల్గొన్నారు..

## తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా బొమ్మల కొలువు




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ బంగ్లాస్ ఏరియాలోని వైసిఓఏ క్లబ్‌లో శనివారం బొమ్మల కొలువు వేడుకలను నంగా నిర్వహించారు. ఏరియా సేవా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు మునిగంటి ఉమరాణి శ్రీనివాస్, జిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వి సూర్యనారాయణ సతీమణి మాలతి సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు సతీమణి విజయలక్ష్మి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బొమ్మల కొలువు మన పూర్వీకులు అందించిన గొప్ప సంప్రదాయమని, దీనిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమ్మక్క సారలమ్మ ప్రాంగణం, రంగవల్లులు, పల్లె జీవన విధానాన్ని ప్రతిబింబించే బొమ్మల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని అతిథులు ప్రశంసించారు. మహిళలందరూ ఉత్సాహంగా పాల్గొని సంస్కృతిని చాటి చెప్పడం సంతోషకరమన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పద్మ విజయ భాస్కర్, శ్రీవాణి రాధ కృష్ణా, శివకుమారి చిరంజీవి, అనిత లలిత్ కుమార్, వనజ వెంకటయ్య, ఆశ నరసింహారావు, కవిత వీరభద్ర రావు, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


## పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర



### జిల్లా కలెక్టర్ కె.హరిత

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే ప్రధాన భూమిక అని కొమురం బీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం కాగజ్ నగర్ పట్టణంలోని మైనారిటీ సంక్షేమ పాఠశాలలో ఐదు మండలాల సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలపై సర్పంచ్‌లకు పూర్తి అవగాహన ఉంటుందని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పంచాయితీల్లో ఆదాయ వనరులు పెంచుకోవడంతో పాటు పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామపంచాయతీ చట్టాలపై అవగాహన పెంచుకుని ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారుల సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలన్నారు. రైతులు పంట మార్పిడి విధానం ద్వారా ఆర్థికంగా ఎదిగేలా అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారులు ఉమర్ హుస్సేన్, హరి ప్రసాద్, ఐదు మండలాల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎలకపల్లి గ్రామ సర్పంచ్ భక్తు రాంచందర్ హామీ ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పాఠశాలను సందర్శించిన ఆయన తరగతి గదులు, హాస్టల్, వంటశాల, స్టోర్ రూమ్ లను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం తమ ప్రధాన బాధ్యత అని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలపై ప్రిన్సిపాల్ తో చర్చించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఓ కవిత సిబ్బందితో కలిసి సర్పంచ్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్, బిజెపి మండల నాయకులు ఘనపురం నగేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పి చైర్మన్

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మహ్మద్‌నగర్ మండలంలోని సింగితం గ్రామ మాజీ సర్పంచు ర్యాల లావణ్య గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రపాణాలు విడిచారు. విషయం తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, మాజీ జడ్పీ చైర్మెన్ దఫేదర్‌రాజు సింగితం గ్రామానికి చేరుకుని లావణ్య భర్త శ్రీధర్‌రెడ్డిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. వారి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, మాజీ సీడీసీ చైర్మెన్ దుర్గారెడ్డి, గంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, మాజీ సొసైటీ చైర్మెన్ వాజిద్‌అలీ, మాజీ సర్పంచులు లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, నారాయణ, మహేంధర్, ఉపసర్పంచు మిడత సాయిలు, మనీష్‌రెడ్డి, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఛాంపియన్ జిమ్ సెంటర్ ప్రారంభం

ప్రజాపక్షం/భూపాలపల్లి:భూపాలపల్లి జిల్లాలో ఏర్పాటు చేసిన ఛాంపియన్ జిమ్ సెంటర్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా యువత ముఖ్యంగా విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలు మరియు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, మానసిక స్థైర్యాన్ని పెంపొందించు కోవడంలో వ్యాయామానికి కీలక పాత్ర ఉందని, క్రీడలు, ఫిట్‌నెస్ ద్వారా యువత సరైన దిశలో ముందుకు సాగుతుందని తెలిపారు. ఇలాంటి జిమ్ సెంటర్లు యువతను సానుకూల మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అలాగే, పోలీస్ నోటిఫికేషన్లు విడుదలవుతున్న నేపథ్యంలో పోలీస్ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న అభ్యర్థులకు జిమ్, క్రీడల ద్వారా శారీరకంగా మానసికంగా సిద్ధమవడం ఎంతో ఉపయోగకరమని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

# గోదావరి తీరం వద్ద పారిశుద్ధ్య పనులు



ప్రజాపక్షం/కాళేశ్వరం:జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గోదావరి ప్రధాన ఘాట్ వద్ద శనివారం గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు.తీరం వద్ద పేరుకు పోయిన వ్యర్థాలు, చెత్తాచెదారాలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తొలగించి శుభ్రపరిచారు.

# నేడు సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు

ప్రజాపక్షం/కాళేశ్వరం:జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని అనుబంధ ఆలయమైన సూర్యనారాయణ స్వామి ఆలయంలో నేడు ఆదివారం ఉదయం పది గంటలకు రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఇఒ తెలిపారు.

# కోటగుళ్లలో కాకతీయుల కుడ్యచిత్రాలను సంరక్షించాలి

### టార్చ్ ఆధ్వర్యంలో పురావస్తు శాఖ ఉన్నతాధికారులకు లేఖలు

ప్రజాపక్షం/గణపురం:కాకతీయుల చారిత్రక సంపద కోటగుళ్ల ఆలయంలో ఉన్న సుమారు 800 ఏళ్ల నాటి అరుదైన కుడ్యచిత్రాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీం ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ హెరిటేజ్ (టార్చ్) కార్యదర్శి చరిత్రకారుడు అరవింద్ ఆర్య అన్నారు. గత మూడు రోజులుగా కోటగుళ్ళు ఆలయ సముదాయాల్లో కుడ్య చిత్రాలను టార్చ్ ఆధ్వర్యంలో నలుగురు బృందం పరిశీలించి ఫోటోలు వీడియోలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా అరవింద్ ఆర్య మాట్లాడుతూ శిల్ప సంపద నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆలయ రాతి దూలాలు, పైకప్పు పలకలపై సహజ రంగులతో చిత్రించిన నర్తకులు, కిన్నెరలు, హంసలు వంటి దృశ్యాలు నేటికీ కాకతీయుల కళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని కాలక్రమంలో వాతావరణ ప్రభావాలు, సరైన సంరక్షణ లేకపోవడం వల్ల ఈ చిత్రాలు మసకబారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుడ్య చిత్రాలకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కోటగుళ్లలోని కాకతీయ కాలపు కుడ్యచిత్రాలను శాస్త్రీయ పద్ధతుల్లో పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, పురావస్తు శాఖను కోరారు. కాకతీయుల పాలనా కాలం తెలంగాణ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయమని వారి వారసత్వానికి ఈ కుడ్యచిత్రాలు కీలక ఆధారాలని అరవింద్ ఆర్య తెలిపారు. శిల్పకళతో పాటు చిత్రలేఖనంలో కూడా కాకతీయులు ఎంత నిష్ణాతులో ఈ చిత్రాలు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన అన్నారు. సరైన పరిరక్షణ లేక ఇప్పటికే 90 శాతం చిత్రాలు పాడయ్యాయని , వీటిని తక్షణం కాపాడాల్సిన అవసరం ఉందని ఈ విషయమై పురావస్తు శాఖ డైరెక్టర్‌కు లేఖ ద్వారా వినతి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కోటగుళ్లలోని ఈ అమూల్యమైన కుడ్యచిత్రాలను కాపాడితే, భవిష్యత్ తరాలకు కాకతీయుల కళా వైభవాన్ని అందించినట్లవుతుందని అరవింద్ ఆర్య అన్నారు. ఈ పరిశోధనలో తాళ్ల పెళ్లి నందకిషోర్, అరుణ్ కుమార్ నలిమెల, నవీన్ లు పాల్గొన్నారు.

# బిర్రు యాకయ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాపక్షం/వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల పరిధిలోని నల్లబెల్లి గ్రామానికి బిర్రు మహేందర్ తండ్రి గారైన బిర్రు యాకయ్య గారు మరణించగా శనివారం వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట వర్ధన్నపేట నియోజక వర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, ఇల్లంద మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య కాంగ్రెస్ నాయకులు, మన్నే బాబు రావు, బిర్రు మౌనిక రాజు జక్కి గోపాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తుల్ల రవితో పాటుపాల్గొన్నారు.

**కొమురయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు**

వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 9వ డివిజన్ కు చెందిన మాజీ కౌన్సిలర్ మంచాల రామకృష్ణ గారి తాత చందు కొమురయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వర్ధన్నపేట టౌన్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు మైస సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి మాజీ కౌన్సిలర్ మంచాల రామకృష్ణ యాదవ్, అంబేద్కర్ నగర్ సర్పంచ్ చీటూరి రాజు, పట్టణ నాయకులు సిలివేరు శ్రీధర్ యాదవ్, చందు మల్లయ్య యాదవ్, చందు రవి యాదవ్, దుబ్బాక శివ, దుబ్బాక రాజు కుమార్, చందు సాయిలు పాల్గొన్నారు

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



ప్రజాపక్షం/మహదేవపూర్;కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ ఆరోపించారు.శనివారం మండలకేంద్రంలో టిపిసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న ప్రాంతానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు.ఈ సందర్భంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.పనిదినాలు తగ్గించడంతో పాటు వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరగడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటున్నామని కూలీలు విన్నవించడంతో సంఘీభావం తెలిపారు.అనంతరం జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కావాలనే ఉపాధి హామీ పథకాన్నినిర్వీర్యం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సాహకార సంఘం చైర్మెన్ వామన్ రావు,వార్డు సభ్యుడు అస్రార్ ఖురేషి,నాయకులు జగదీష్,రవి,గడ్డం శ్రీను,చక్రధర్,హరీష్,సోహేల్,సురేందర్,గట్టయ్య,హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

# వనదేవతలను దర్శించుకున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/భూపాలపల్లి :భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి మేడారం శ్రీ సమ్మక్కసారలమ్మ వన దేవతలను శనివారం దర్శించుకున్నారు. సంప్రదాయం ప్రకారం ఆలయ ఇఒ శ్రీ వీరస్వామి కలెక్టర్ కుటుంబ సభ్యులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శ్రీ సమ్మక్క సారలమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎత్తు బంగారం సమర్పించారు. అనంతరం దేవతల ఆశీస్సులు పొందుతూ జిల్లా ప్రజల శ్రేయస్సు, సుఖసంతోషాలు, అభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో కలెక్టర్ తల్లిదండ్రులు, సతీమణి పాల్గొన్నా రు.

# సమాజంలో బాలికలకు విద్యతోనే గౌరవం

ప్రజాపక్షం/కమలాపూర్:హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు కమలాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవి బాలికల గురుకుల విద్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బాలికా విద్య ప్రాముఖ్యత అనే అంశం పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన హైస్కూల్ విభాగం నుండి ముగ్గురికి, ఇంటర్మీడియట్ విభాగం నుండి ముగ్గురికి మొత్తం ఆరుగురు విద్యార్థులకు బహుమతులుగా శంకర్ నారాయణ డిక్షనరీలు, మెమొంటోలు ట్రస్ట్ నిర్వాహకుల చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.... బాలికలకు విద్య అనేది ఒక ధైర్యం అని, సమాజంలో గౌరవం పెంచుతుందని, దేశ అభివృద్ధి, సమాజాభివృద్ధికి తోడ్పతుందని తెలిపారు. మధురమ్మ ట్రస్ట్ వారు వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు ఉపయోగపడే బహుమతులు అందించడం అభినందనీయని, ట్రస్ట్ చేస్తున్న సేవలు వెలకట్టలేనిదని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలో మంచి ప్రతిభ కనబరిచిన పి. హర్షిత, ఏ. ఐశ్వర్య, బి. అక్షయ, ఎస్. కవిత, వై. హాని, కె. అక్షిత విద్యార్థులకు స్పెషల్ ఆఫీసర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశరాజుపల్లిలో జాతీయ బాలిక దినోత్సవం

ప్రజాపక్షం/కమలాపూర్:మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం గ్రామ ప్రజలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.... గర్భిణీ స్త్రీలు, బాలింతలు గ్రామ ప్రజలకు బాలిక దినోత్సవం యొక్క ప్రాముఖ్యత ను గురించి వివరించారు. 104, 181, 100, అబార్షన్లు మహిళా ఆరోగ్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రి డెలివరీలు, సాధారణ ప్రసవాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దేశరాజుపల్లి గ్రామ సర్పంచ్ మిట్టపల్లి మహేశ్వరి కుమారస్వామి మహిళలు ఆరోగ్యంగా ఉండాలని, ఆడపిల్లలను చదివించాలని, స్త్రీలని ప్రభుత్వ ఆసుపత్రి డెలివరి సేవలు ఉపయోగించుకోవాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేశరాజుపల్లి ఉప సర్పంచ్ అరవింద్, డాక్టర్ అరుణ్ కుమార్, ఏఎన్ఎం లావణ్య, ఆశా కార్యకర్తలు రజిత, సంధ్య, రాణి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# అంబేద్కర్ చిత్ర పటంతో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరపాలి

### ఎడిఎస్ఎస్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యల నర్సింహారావు

ప్రజాపక్షం/కన్నాయిగూడెం:భారత రాజ్యాంగ నిర్మాత దళిత బహుజన వర్గాల విమోచకుడు భారత గణతంత్రానికి పునాది వేసిన మహానాయకుడు డాక్టర్, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని గణతంత్ర దినోత్సవం రోజున ప్రతి గ్రామంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యంగా నూతనంగా ఏర్పాటైన గ్రామపంచాయతీ కార్యాలయాల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేసి జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏటూరునాగారం మండలం డిప్యూటీ తాసిల్దార్ కి దళిత ఉద్యమ నాయకులు వినతిపత్రం అందజేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏజెన్సీ దళిత సేవా సంఘం (ఎడిఎస్ఎస్) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కోయ్యల నర్సింహారావు ఏంఆర్పిఎస్ ములుగు జిల్లా నాయకులు ఎంపెల్లి శంకర్, తదితర నాయకులు గ్రామస్థాయి కార్యకర్తలతో కలిసి ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకుని అధికారికంగా వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో ముఖ్యంగా గణతంత్ర దినోత్సవం అనేది కేవలం జెండా ఎగరేసే కార్యక్రమం మాత్రమే కాకుండా భారత రాజ్యాంగ విలువలను ప్రజలకు గుర్తు చేసే పవిత్ర సందర్భమని పేర్కొన్నారు. రాజ్యాంగం లేకపోతే ఈ దేశంలో కోట్లాది మంది బడుగు బలహీన దళిత, ఆదివాసీ, మైనార్టీ వర్గాలకు సమాన హక్కులు సమాన అవకాశాలు ఉండేవి కావని నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లేకపోతే ఈ దేశంలో ఓటు హక్కు విద్యా హక్కు ఉద్యోగ అవకాశాలు చట్టపరమైన రక్షణలు బహుజనులకు దక్కేవి కావని తెలిపారు. అలాంటి మహానాయకుడి చిత్ర పటాన్ని గణతంత్ర దినోత్సవం రోజున ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టకపోవడం అనేది రాజ్యాంగ ఆత్మకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో జెండా ఆవిష్కరణ జరుగుతున్నప్పటికీ రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ చిత్ర పటానికి తగిన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాల్లో కూడా అంబేద్కర్ ఫోటో లేకుండా కార్యక్రమాలు నిర్వహించడం బాధాకరమన్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అమలు చేయాలి. ఈ డిమాండ్‌ను కేవలం ఒక మండలానికి లేదా జిల్లాకే పరిమితం చేయకుండా రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలని వారు కోరారు. పాఠశాలలు మండల కార్యాలయాలు జిల్లా కలెక్టరేట్లు పోలీస్ స్టేషన్లు గ్రామపంచాయతీలు అన్నింటిలోనూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటం ముందు జెండా ఆవిష్కరణ జరగాలని ఏడిఏస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యల నర్సింహారావు స్పష్టం చేశారు. దీంతో పాటు విద్యార్థులకు రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా నిర్వహించాలని నాయకులు సూచించారు. చిన్ననాటి నుంచే అంబేద్కర్ చేసిన సేవలను తెలుసుకుంటేనే సమానత్వం సోదరభావం వంటి విలువలు సమాజంలో బలపడతాయని పేర్కొన్నారు. వినతిపత్రం స్వీకరించిన ఏటూరునాగారం మండల డిప్యూటీ తాహశీల్దార్ ఈ అంశాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తగిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వీరందరూ ఒకే స్వరంతో మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవం అంటే అంబేద్కర్‌ను గుర్తు చేసుకునే రోజు రాజ్యాంగం ద్వారా ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం తీసుకొచ్చిన వ్యక్తికి గౌరవం ఇవ్వడం ప్రతి భారతీయుడి బాధ్యత అని వారు తెలిపారు. దళిత నాయకులు ఎంపెల్లి శంకర్ పరికి వేణుగోపాల్ చిలువేరు అన్నమయ్య పాల్గొన్నారు.